ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 7 జూలై 2025



నేడు మడ్డువలస సాగునీరు విడుదల

జి.సిగడాం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటకు గొర్లె శ్రీరాములు నాయుడు రిజర్వాయర్(మడ్డువలస జలాశయం) నుంచి సోమవారం సాగునీరు విడుదల చేయనున్నట్టు డీఈ పి.అర్జున్, ఏఈఈలు నితిన్‌కుమార్, అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చేతుల మీదుగా మధ్యాహ్నం మూడు గంటలకు సాగునీరు విడుదల చేస్తారు. ఉమ్మడి జిల్లాలోని జి.సిగడాం, పొందూరు, లావేరు, వంగర, రేగిడి, సంతకవిటి మండలాలకు చెందిన 30,077 ఎకరాలకు 100 క్యూసెక్కులను విడిచిపెట్టనున్నామ'ని వారు తెలిపారు.



- పట్టణాల్లో వెలగని విద్యుత్ లైట్లు
- సెంట్రల్ లైటింగ్ సైతం అస్తవ్యస్తం
- నిర్వహణపై పాలకవర్గాల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న జనం

ఆరు దాటితే చీకటే!

ఇచ్ఛాపురం బస్టాండ్ జంక్షన్‌లో వెలగని వీధిలైట్లు

ఇచ్ఛాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పురపాలక సంఘాల్లో ప్రజలకు విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఎక్కడా సక్రమంగా పని చేయడం లేదు. మునిసిపాలిటీల్లో వీధి దీపాల నిర్వహణ బాధ్యత పాలకవర్గాలదే. దాదాపు అన్నిచోట్లా వైసీపీ పాలకవర్గాలు ఉండడంతో వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించడం లేదు. దీంతో సాయంత్రం ఆరు గంటలు దాటితే.. పట్టణాలు చీకటిమయంగా మారుతున్నాయి. జిల్లాలో శ్రీకాకుళం కార్పొరేషన్, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటితోపాటు టెక్కలి, నరసన్నపేట తదితర మేజర్ పంచాయతీల్లో సెంట్రల్ లైటింగ్ ఉంది. కానీ నిర్వహణలో మునిసిపాలిటీ పాలకవర్గాలు పూర్తిగా విఫల మయ్యాయి. విద్యుత్‌శాఖ సిబ్బంది కూడా అరకొరగా ఉండడంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి.

- శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలోని పాలకొండ రోడ్డులో పొట్టి శ్రీరాములు జంక్షన్ వరకూ, జీటీ రోడ్డు, రామలక్ష్మణ కూడలి, సింహద్వారం, నాగావళి నదిపై కొత్తవంతెన తదితర ప్రధాన ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్‌లు ఉన్నాయి. కానీ వీటి నిర్వహణ ఆశాజనకంగా లేదు. మొత్తం 50 డివిజన్లకుగాను 12,836 విద్యుత్ దీపాలు ఉన్నాయి. కొన్నిచోట్ల లైట్లు వెలగడం లేదు. మరికొన్నిచోట్ల పగటిపూట వెలుగుతున్నాయి. కమాండ్ కంట్రోల్ సిస్టం అస్తవ్యస్తంగా మారుతోంది.
- ఇచ్ఛాపురం మునిసిపాలిటీలోని 23 వార్డుల పరిధిలో 1,680 విద్యుత్ దీపాలు ఉన్నాయి. 12 సంవత్సరాల కిందట ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహణ బాగుండేది. తరువాత వైసీపీ హయాంలో పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో కొన్ని స్తంభాలు పడిపోయాయి. కొన్నిలైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. ప్రధానంగా మార్కెట్ జంక్షన్, దాసన్నపేట కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతం, ఆస్పత్రి రోడ్డు, రథం వీధి, మంగళవారంపేట, వీకే.పేట, రత్తకన్న తదితర ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల నుంచే చీకటి అలుముకుంటోంది. వేలాది వీధిలైట్ల నిర్వహణకుగాను ఉన్నది ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. అటు పాలకవర్గం పట్టించుకోకపోగా... ఇటు సిబ్బంది చాలకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 31 వార్డుల్లో 4,500 విద్యుత్ దీపాలు ఉన్నాయి. కానీ వీటి నిర్వహణకు ఉన్న సిబ్బంది కేవలం నలుగురే. దీంతో వీధిదీపాల ఏర్పాటు, మరమ్మతులు, పర్యవేక్షణ ఇబ్బందికరంగా మారుతోంది. ఇంత పెద్ద మునిసిపాలిటీలో విద్యుత్ లైట్లు మార్చేందుకు హైడ్రా కూడా లేదు. దీంతో ప్రతి స్తంభం ఎక్కాల్సిన పరిస్థితి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, లైట్ల ఏర్పాటులో జాప్యమవుతోంది.
- ఆమదాలవలస మునిసిపాలిటీలోనూ అదే పరిస్థితి. 23 వార్డులకుగాను 3,300 విద్యుత్ లైట్లు ఉన్నాయి. ఇక్కడ కూడా సెంట్రల్ లైటింగ్ ఉంది. కానీ సిబ్బంది కేవలం ముగ్గురే. దీంతో లైట్లు అమర్చేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ రైల్వేస్టేషన్ ఉండడంతో నిత్యం ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుంది. రాత్రిపూట రైలు దిగేవారు పట్టణంలో అంధకారం చూసి భయపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మునిసిపాలిటీల్లో విద్యుత్ దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అనధికార కోతలతో ఇక్కట్లు..

జిల్లాలో అనధికార విద్యుత్ కోతలు పెరుగుతున్నాయి. ఈదురుగాలులు వీచినా, చిన్నపాటి వర్షం కురిచినా చాలు.. ఫీడర్ బ్రేక్‌డౌన్ అంటూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు మాత్రం విద్యుత్ కోతలే లేవని చెబుతున్నారు. కానీ రోజులో ప్రతి పూట సరఫరాను నిలిపివేసి (మిగతా 8వ పేజీలో..)

అనిశ్చితిలో ధర్మాన



- వైసీపీ సమావేశానికి, కార్యక్రమాలకు దూరం
- వ్యూహాత్మకంగానే మౌనం
- తనయుడు కూడా స్తబ్దుగా ఉంటున్న వైనం

శ్రీకాకుళం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ కీలక నాయకుడు ధర్మాన ప్రసాదరావు ప్రసుత్తం అనిశ్చితిలో ఉన్నారు. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన వైసీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఉత్తరాంధ్రకు చెందిన పార్టీ సీనియర్ నాయకులంతా హాజరయ్యారు. వైసీపీ బలోపేతం దిశగా కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కానీ ఈ సమావేశానికి సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు హాజరుకాలేదు. ఆయన కుమారుడు రామ్‌మనోహర్ నాయుడు కూడా గైర్హాజరయ్యారు. స్వయానా ధర్మాన అన్న, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ప్రసాదరావు గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది.

● పరిస్థితి ముందే ఊహించి..

2014 ఎన్నికల్లో వైసీపీ తరఫున శ్రీకాకుళం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ధర్మాన ప్రసాదరావు ఓటమి పాలయ్యారు. ఆ ఐదేళ్లు పార్టీ కార్యక్రమాల్లో ఆయన పెద్దగా పాల్గొనలేదు. 2019 ఎన్నికల్లో మళ్లీ అదేస్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. కానీ, మొదటి రెండున్నరేళ్లు స్తబ్దత పాటించారు. తర్వాత మంత్రి పదవి లభించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో జగన్‌ను కీర్తించడం... వైసీపీ కార్యక్రమాల్లో అయిష్టంగానే పాల్గొనేవారు. 2024 ఎన్నికల్లో మళ్లీ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేయగా ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన ఇంటికే పరిమితమైపోయారు. కొద్దినెలలు కిందట పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చిన జగన్‌ను కలిసేందుకు ధర్మాన వెళ్లారు. అంతే.. ఆ తర్వాత పార్టీ కార్యక్రమాల్లో గానీ.. ఇటు జనంలోగానీ పాల్గొనలేదు. ఇప్పట్లో వైసీపీ నిలదొక్కుతుందా?.. అనే అనుమానంతో.. ముందస్తు వ్యూహంతో.. ఆయన అనిశ్చితిగా ఉంటున్నారు.

సొంత అన్న ధర్మాన కృష్ణదాస్ వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నా, తమ్ముడు ధర్మాన ప్రసాదరావు కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం.. పైపెచ్చు.. జిల్లాకేంద్రమైన శ్రీకాకుళంలో ఆ స్థాయి వైసీపీలో మరో నాయకుడ్ని (మిగతా 8వ పేజీలో..)

ఇంజనీరింగ్ కోర్సు

ఎంపికే కీలకం



- ఏ బ్రాంచి తీసుకున్నా ఆసక్తి ఉంటేనే అద్భుతాలు
- నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల/ నరసన్నపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్-2025 కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ ఏడాది జిల్లాలో 12,633 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ర్యాంకులు వచ్చిన విద్యార్థులు ఇంజనీరింగ్ కళాశాలల్లో అడుగుపెట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇంజనీరింగ్‌లో ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ, మెకానికల్, సివిల్, ఈఈఈ, అగ్రికల్చరల్, కెమికల్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, యానిమేషన్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) తదితర కోర్సులు ఉన్నాయి. ఏ బ్రాంచ్ తీసుకున్నా ఈ విద్యా సంవత్సరం నుంచి అదనంగా క్వాంటమ్ కంప్యూటింగ్ సబ్జెక్ట్‌ను విద్యార్థులు చదవాల్సి ఉంటుంది. విమాన వేగంతో సమానంగా సిగ్నల్ సిస్టమ్ పనిచేయడమే క్వాంటమ్ కంప్యూటింగ్ ముఖ్య ఉద్దేశం. విద్యార్థుల ఆసక్తి మేరకు కోర్సులను ఎంపిక చేసుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కోర్సుల వారీగా డిమాండ్, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మార్కెట్లో ఏ మేరకు ఉన్నాయో ముందుగా తెలుసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. వృత్తి నైపుణ్యం పెంపొందించే దిశగా ముందుకు సాగాలని, పరిశీలన, పరిశోధనాత్మకంగా ఆలోచిస్తే ఉద్యోగావకాశాలతోపాటు ఉజ్వల భవిత పొందవచ్చని స్పష్టం చేస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు థియరీ కంటే ప్రాక్టికల్స్ ఎంతో ముఖ్యమని పేర్కొంటున్నారు.

జిల్లాలో 3,870 సీట్లు..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అంబేడ్కర్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ఉంది. అలాగే, శ్రీశివానీ(చిలకపాలెం), శ్రీవెంకటేశ్వర (ఎచ్చెర్ల), ఆదిత్య (టెక్కలి), జీఎంఆర్ ఐటీ (రాజాం)లో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. అంబేడ్కర్ యూనివర్సిటీలో 180, నాలుగు ప్రైవేటు (మిగతా 8వ పేజీలో..)

శిథిలావస్థలో


జీసీసీ డిపోలు

- పెచ్చులూడుతున్న శ్లాబులు, గచ్చులు
- సరుకుల నిల్వకు ఇబ్బందులు
- మరమ్మతులు చేపట్టాలని గిరిజనుల విజ్ఞప్తి

8 లో

ఘనంగా తొలి ఏకాదశి

7 లో



శ్రీకాకుళంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం



కూర్మనాథపురంలో పీర్ల ఊరేగింపు

8 లో

రైలు ఢీకొని 13 పశువుల మృతి

- హరిద్వారంలో విషాదఛాయలు

8 లో

వసపలో యువకుడి దారుణ హత్య

- డబ్బుల విషయంలో చెలరేగిన వివాదం
- దాడి చేసి చంపేసిన టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు



మిన్నారావు (ఫైల్)

కొత్తూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వసప గ్రామంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి విచక్షణారహితంగా దాడి చేసి ఆ యువకుడిని చంపేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వసప గ్రామానికి చెందిన లుకలాపు మిన్నారావు(21) అనే యువకుడు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్దకు శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో వెళ్లాడు. అక్కడ డబ్బుల విషయంలో టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు మలగాన శంకరరావు, మిన్నారావు మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. అప్పటికే వారిమధ్య పాతకక్షలు ఉన్నాయి. దీన్ని మనసులో పెట్టుకొని శంకరావు కర్రతో విచాక్షణారహితంగా దాడిచేసి గాయపర్చడంతో మిన్నారావు మృతి చెందాడు. ఆదివారం ఉదయం రోడ్డుపక్కన మిన్నారావు మృతదేహం పడిఉండడంతో స్థానికులు కొత్తూరు పోలీసులకు సమాచారం అందించారు. కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాద్, కొత్తూరు, హిరమండలం ఎస్ఐలు ఎండీ అమీరుఅలీ, ఎండీ యాసిన్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. మిన్నారావు తండ్రి బుడ్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఆసుపత్రికి తరలించారు. కాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు స్థానికులు చెబుతుండగా, పోలీసులు మాత్రం తమ అదుపులో ఎవరూ లేరని అంటున్నారు. చేతికి అందివచ్చిన కుమారుడు హత్యకు గురవడంతో తల్లిదండ్రులు బుడ్డు, లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వీరికి ఓ కుమార్తె ఉన్నారు. యువకుడి హత్యతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

మా కుమారుడు ఏమయ్యాడో?



వెంకటేష్ (ఫైల్)

- వారం రోజులుగా ఆచూకీ లేదు
- ఓ యువకుడి తల్లిదండ్రుల ఆందోళన
- 'హైదరాబాద్' కంపెనీలోని పేలుడు ఘటనలో మృతి చెంది ఉంటాడని అనుమానం
- ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి

జి.సిగడాం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన తమ కుమారుడు ఏమయ్యాయోడని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 30న ఆ యువకుడు పని చేస్తున్న కంపెనీలో పేలుడు సంభవించి 40 మంది మృతి చెందారు. అప్పటి నుంచీ వారం రోజులుగా తమ కుమారుడి ఆచూకీ కానీ, క్షేమ సమాచారం కానీ లేదని వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. జి.సిగడాం మండలం పాలఖండ్యాం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన గుంటుపల్లి వెంకటేష్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా పాశమైలం సిగాచి కంపెనీలో నాలుగేళ్ల కిందట చేరాడు. తల్లిదండ్రులు చిన్నారావు, పద్మావతి జగన్నాథపురంలోనే నివాసం ఉంటున్నారు. కాగా, గత నెల 30న సిగాచి కంపెనీలో పేలుడు సంభవించడంతో 40మంది వరకు మృతి చెందారు. ఈ సమాచారాన్ని టీవీలో చూసిన వెంకటేష్ తల్లిదండ్రులు, సోదరి అనిత ఆందోళన చెందారు. వెంటనే వెంకటేష్‌కు ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో తండ్రి చిన్నారావు హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ కంపెనీలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో తమ కుమారుడు ఏమయ్యాడోనని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాద సమయంలో డ్యూటీలో ఉన్నట్టు రికార్డులో నమోదైందని, ఆ ప్రమాదంలో మృతి చెంది ఉంటాడేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకూ తమ కుమారుడికి సంబంధించిన సమాచారం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని వెంకటేష్ ఆచూకీ తెలియజేయాలని, ఒకవేళ మృతి చెంది ఉంటే మృతదేహాన్ని అప్పగించాలని వేడుకుంటున్నారు.



రోదిస్తున్న తల్లి పద్మావతి, సోదరి అనిత



ఘనంగా తొలి ఏకాదశి పూజలు

నరసన్నపేట/ఆమదాలవలస/అరసవల్లి/శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల/గార, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. నరసన్నపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్షతులసీ దళాలతో స్వామివారికి అర్చన చేశారు. శ్రీకాకుళం డీసీసీబీ కాలనీలోని భూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం జరిపించారు. ఆమదాలవలస పట్టణంలోని మెట్టక్కివలసలో భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అఖండ నామ సంకీర్తన నిర్వహించారు. అరసవల్లిలో సూర్యనారాయణ స్వామివారి కల్యాణం జరిపించారు. శ్రీకాకుళం నగరంలోని శ్రీకృష్ణార్జునమందిరం, కోదండరామాలయం, గుజరాతీపేట జగన్నాథస్వామి, నారాయణ తిరుమల, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏకదశి పూజలు జరిగాయి. శాలిహుండం వద్ద శ్వేతగిరిపై వెలసిన కాళీయమర్దన వేణుగోపాల స్వామివారికి విశేష పుష్పాలంకరణ సేవ, నక్షత్ర హారతి సేవ, నీరాజనం, మంత్ర పుష్పం పూజలు నిర్వహించారు. ఎచ్చెర్లలోని శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు దూబ శరత్‌కుమార్ (భవానీ) ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ గుంప శివప్రసాద్ పాల్గొన్నారు.


ఎచ్చెర్లలో పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి, గారలో పుష్పాలంకరణలో వేణుగోపాలస్వామి

పెంపుడు జంతువులతో జాగ్రత్తగా ఉండాలి

పాతశ్రీకాకుళం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కంచరాన రాజగోపాలరావు అన్నారు. ఆదివారం నగరంలోని వెటర్నరీ పోలీక్లీనిక్ ఆవరణలో ప్రపంచ జూనోసిస్ డే నిర్వహించారు. పెంపుడు జంతువులు నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. 602 పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు వేశారు.

రణస్థలంలో..

రణస్థలం, జూలై6(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ప్రపంచ జూనోసిస్ డే నిర్వహించారు. పశువైద్యశాఖ ఏడీ దుర్గారావు ఆధ్వర్యంలో 67పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్ వేశారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి 15వ వార్డు పశువైద్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవికుమార్ పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఆపార్టీ నాయకులు పశువుల దాణా పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం రైతులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య అసిస్టెంట్ డైరెక్టర్ జి.నారాయణరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అవలింగిలో మారు రథయాత్ర

జలుమూరు (సారవకోట), జూలై 6 (ఆంధ్రజ్యోతి): అవలింగి గుండిచా మందిరంలో కొలువు తీరిన జగన్నాథ స్వామి మారు రథయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. పదిరోజులు పాటు వివిధ అవతారాల్లో దర్శనమిచ్చిన స్వామి మారు రథయాత్రతో నిజస్థానానికి చేరుకున్నారు. భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులు అందించి తరించారు.

పోలాకి, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు పంచాయతీ ముప్పిడిలో ఆదివారం మారురథయాత్ర నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు.


అవలింగిలో మారు రథయాత్రలో పాల్గొన్న భక్తులు





సమన్వయంతో పార్టీని నడిపించండి

ఆమదాలవలస, జూలై 6(ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు వజ్జ బాబూరావు పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా సంపతిరావు మురళీధరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలుగు మహిళా అధ్యక్షురాలిగా బోయిన సునీత, తెలుగు యువత అధ్యక్షుడిగా తంగి శంకరరావుతో పలు విభాగాలకు ప్రతినిధులను నియమించారు.

వాంబే కాలనీలో కార్డెన్ సెర్చ్

శ్రీకాకుళం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఒకటో పోలీస్‌స్టేషన్ పరిధి వాంబే కాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అందులో ఉంటున్న వ్యక్తులను వారి ఆధార్ కార్డులతో సరిచూశారు. సరైన పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం

అరసవల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని విశాఖపట్నం గాజువాకకు చెందిన నారాయణశెట్టి మురళీకృష్ణ, వసంతకుమారి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.లక్ష విరాళంగా అందజేశారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం

అరసవల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రోటరీ సేవలు ప్రశంసనీయమని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడారు.















రైలు ఢీకొని 13 పశువుల మృతి

● హరిద్వారంలో విషాదఛాయలు



మృతి చెందిన పశువులు

పాతపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హరిద్వారం బొమ్మిక గేట్ మధ్యలో ఆదివారం పూరీ-గుణుపూర్ స్పెషల్ ట్రైన్ ఢీకొన్న ఘటనలో 13 పశువులు మృత్యువాత పడగా మరో నాలుగు తీవ్ర గాయాలపాల య్యాయి. వివరాలిలా ఉన్నాయి.. పూరీలో జరుగు తున్న జగన్నాథ రథయాత్ర సందర్భంగా రైల్వేశాఖ పూరీ-గుణుపూర్ స్పెషల్ రైలును వేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ రైలు ఉదయం 11.30 గంటల సమయంలో బొమ్మిక గేట్ సమీపంలో పశువులను ఢీకొనడంతో అవి చెల్లాచెదురుగా పడిపోయాయి. స్పెషల్ ట్రైన్ వస్తోందని తెలియలే దని, లేకుంటే జాగ్రత్తలు పాటించేవార మని బాధిత రైతులు వాపోతున్నారు. ఒక్కసారిగా రైలు ఢీకొని పశు వులు మృత్యువాత పడిన విషయం తెలుసుకుని గ్రామస్థులు అక్కడికి చేరుకుని పశువులు మృతి చెందిన ఘటన చూసి లబోదిబోమన్నారు. ఈ ప్రమాదంలో హరిద్వారం గ్రామానికి చెందిన లుకలాపు ఆదినారాయణ కు చెందిరు ఆరు, బాసురు సోములుకు చెందిన రెండు, ఎన్ని పాపారావు, గొగ్గి శిమ్మయ్య, కలగ రమేష్, బొమ్మాళి అప్పలరాజు, బోడసింగి గిరిలకు చెందిన ఒక్కో ఆవు మొత్తం 13 పశువులు మృతిచెందడంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. పశువుల మందలో ఆవు దూడలు, ఎద్దులు కూడా ఉన్నా యని గ్రామస్థులు తెలిపారు. ఘటనా స్థలానికి రెవెన్యూ, పశు సంవర్థక శాఖాధికారులు చేరుకుని ప్రాథమిక సమా చారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా పశు సంవర్థక శాఖ ఏడీ డా. మంచు కరుణాకరరావు మాట్లాడుతూ.. మృతి చెందిన పాడి పశువులకు పశుబీమా లేదన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచనలమేరకు సంబంధిత ప్రమాద వివరాల నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలి పారు. ఘటనా స్థలాన్ని టీడీపీ నేత బుద్దల నరేష్, గ్రామ పెద్ద గొబ్బి కృష్ణారావు, పశు వైద్యుడు కిరణ్ లుకలాపు మోహన్ శ్యాం సుందరరావు తదితరులు పరిశీలించారు. చిన్ననాటి నుంచి ఆవులు పెంచుతున్నానని, ఏనాడూ ఇంత విపత్తు ఎదుర్కోలేదని, తనను ఆదుకోవాలని బాధిత రైతు లుకలాపు ఆదినారాయణ వేడుకుంటున్నాడు.

కిడ్నీ వ్యాధితో వివాహిత మృతి



లక్ష్మీదేవి (ఫైల్)

వజ్రపుకొత్తూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఒంకులూరుకు చెందిన దుమ్ము లక్ష్మీదేవి (39) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందింది. నెల రోజులుగా ఈమె డయాలసిస్ చేయించుకుం టున్నట్లు గ్రామస్థులు తెలిపారు. చిన్న వయసులో కిడ్నీభూతానికి బలవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈమెకు భర్త రాజు, ఇంటర్ చదువుతున్న కుమార్తె ఉన్నారు.

అనిశ్చితిలో ధర్మాన

(ఐదో పేజీ తరువాయి)

తయారు చేయకపోవడం.. ఇప్పుడు ఆపార్టీకి ఇబ్బంది కరపరిస్థితులు తెచ్చిపెట్టాయి. తనను కలిసిన వారితో ముచ్చట్లు తప్ప.. పార్టీ కార్యక్రమాలు గురించి సైతం ధర్మాన పెద్దగా చర్చించట్లేదని సమాచారం. గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో ఓ సర్పంచ్‌పై ఓటమి పాలవడం.. ఇప్పటికీ ధర్మాన జీర్ణించుకోలేకపోతున్నారని కొంతమంది అభిప్రాయపడుతున్నారు.

● జిల్లా కేంద్రానికి... దిక్కేదీ?

కూటమి ఏడాది పాలనలో వైఫల్యాలను ఎండగట్టేలా వైసీపీ అధిష్ఠానం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రతి నియోజకవర్గంలో మండలాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని మొన్న జిల్లా విస్తృతస్థాయిలో సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి.. ప్రభుత్వ తీరును ఎండగట్టాలని స్పష్టం చేశారు. కానీ ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో పకడ్బందీగా.. ప్రజలను ఆకర్షించే విధంగా చేసే వ్యక్తి ఇప్పుడు కరువయ్యారు. ధర్మాన ప్రసాదరావు స్తబ్దత పాటించినా.. మరో వ్యక్తిని తయారుచేయలేదు. ధర్మాన ప్రసాదరావు అనుచరులుగా మెలిగిన వారు సైతం మౌనం దాల్చుతున్నారు. ఇలా అయితే పార్టీని ఏవిధంగా ముందుకు తీసుకెళ్లగలమని కార్యకర్తలు అంతర్మథనం చెందుతున్నారు. వైసీపీకి జవసత్వాలు ఎలా సాధ్యమవుతాయని మదనపడుతున్నారు. మరో రెండున్నరేళ్ల తర్వాత అప్పటి పరిస్థితిని చూసి వైసీపీపై ఆశలు పెరిగితే పార్టీలో ధర్మాన యాక్టివ్ అవుతారని.. లేదంటే విరామం తీసుకుంటారని తాజా సమాచారం. అయితే ఇటీవల పార్టీ మారుతున్నారన్న ప్రచారం జరిగింది. దీనిపై వివరణ లేదు.. ఖండించలేదు కూడాను. దీనిపై ధర్మాన ఎటువంటి స్పష్టత ఇస్తారనే చర్చ సాగుతోంది.

ఇంజనీరింగ్ కోర్సు ఎంపికే కీలకం

(ఐదో పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ కళాశాలల్లో 3,690 మొత్తం 3,870 సీట్లు ఉన్నాయి

కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా..

ఈ నెల 7 (సోమవారం) నుంచి 16లోగా ప్రోసెసింగ్ ఫీజును చెల్లించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600 చెల్లించాలి. ప్రోసెసింగ్ ఫీజు చెల్లించిన రసీదు, ఏపీ ఈఏపీ సెట్ ర్యాంకు కార్డు, హాల్‌టిక్కెట్, ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, కుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈ నెల 13 నుంచి 18 వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చు. మార్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 19న చేయొచ్చు. 22న సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 23 నుంచి 26లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి. ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. వెబ్ ఆప్షన్ల నమోదులో ఎలాంటి సమస్యలు, సందేహాలు ఉన్నా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించాలని కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. స్పెషల్ కేటగిరీలో సీటు పొందాలనుకున్న విద్యార్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాన్ని నిర్దేశించిన తేదీల్లో హాజరుకావాలని తెలిపారు.

వెబ్ ఆప్షన్ల నమోదులో జాగ్రత్తలు..

వెబ్‌ఆప్షన్ల నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలి. నచ్చిన కోర్సులు, కళాశాలలను ముందుగానే ప్రాధాన్యతా క్రమంలో జాబితాను సిద్ధం చేసుకోవాలి. దాని ఆధారంగా ఆప్షన్లు నమోదు చేయాలి. పలు ఇంజనీరింగ్ కళాశాలల షార్ట్‌ఫాంలు ఇతర కళాశాలల పేర్లవలే ఉంటాయి. వీటి విషయంలో జాగ్రత్తగా లేకపోతే మరో కళాశాలకు ఆప్షన్ నమోదయ్యే ప్రమాదముంది. ఉదాహరణకు వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కోడ్ వీఐటీ ఏపీ కాగా.. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కోడ్ వీవీఐటీగా ఉంటుంది. అలాగే టెక్కలిలో ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ కోడ్ ఏడీఐటీ కాగా.. కాకినాడ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కోడ్ ఏడీటీపీగా ఉంటుంది. ఇలాంటి వాటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

శిథిలావస్థలో జీసీసీ డిపోలు





శిథిలావస్థలో ఉన్న నరహరిపురం జీసీసీ డిపో (ఇన్‌సెట్‌లో) పాడైన గచ్చు

టెక్కలి రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు రేషన్‌తో పాటు నిత్యావసర సరుకులు అందించేందుకు ఉద్దేశించిన జీసీసీ డిపో భవనాలను 20 ఏళ్ల కిందట నిర్మించారు. అయితే ఆ తరువాత ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో సరుకుల పంపిణీ, నిల్వ ఉంచేందుకు సేల్స్‌మెన్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టెక్కలి మండలంలో నరహరిపురం, జీడిపేట గ్రామాల్లో జీసీసీ డిపోలు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ భవనాల పైకప్పులు పెచ్చులూడడంతో పాటు గచ్చులు పాడై బియ్యం, తదితర వస్తువులు నిల్వ చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం కురిస్తే సామగ్రి పాడైపోతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గచ్చుపై టార్పాలిన్లు కప్పి బియ్యం ఉంచాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. నరహరిపురం జీసీసీ డిపోలో సుమారు 450 రేషన్‌కార్డుదారులున్నారు. అలాగే గిరిజనులు పండించే పంట నిల్వ చేసుకునేం దుకు భవనాలు లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి జీసీసీ డిపోలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

సుపరిపాలనతో రాష్ట్రాభివృద్ధి

సుపరిపాలతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా టీడీపీ నిర్వహిస్తున్న 'సుపరి పాలనలో తొలిఅడుగు' కార్యక్రమం ఆదివారం పలు గ్రామాల్లో నిర్వహించారు. ఎమ్మెల్యేలు, పలువురు నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి సంక్షేమ పథకాలను వివరించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



నరసన్నపేట: భవానీపురంలో దివ్యాంగుడికి కరపత్రం ఇచ్చి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి







పాతపట్నం: కాగువాడ, కంచిలి: గోకర్ణపురం, ఆమదాలవలస: వెంగళరావు కాలనీలో ఏడాదిలో చేపట్టిన పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, విప్ బెందాళం అశోక్, కూన రవికుమార్



అరసవల్లి: నగరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



కొత్తూరు: మాతలలో ప్రచారం చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి



ఎచ్చెర్ల: ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జీ తదితరులు

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



అరసవల్లి: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అరసవల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు తెంబూరు మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి సైదుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

కాశీబుగ్గ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ సంత మైదానంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలాస కాశీ బుగ్గ మాదిగ సంఘం పెద్దలు అప్పలరాజు, సింహాచలం, నేతాజీ, ఈశ్వరరావు, బీజేపీ నాయకుడు పి.వైకుంఠరావు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయం కిటకిట



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

అరసవల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తజనంతో ఆదివారం ఆదిత్యాలయం కిటకిటలాడింది. భక్తులు పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి, రావిచెట్టు వద్ద పూజలు చేసి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనాల క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.7,48,824 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.4,24,800, విరాళాల ద్వారా రూ.1,03,894 లు, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,20,130 ఆదాయం లభించింది.

వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న షేక్ బందిగికీ

ఆమదాలవలస, జూలై 6(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌బందిగికీ సాహెబ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏ సంఘ జిల్లా మహాసభ టి.త్రినాథరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాహెబ్ మాట్లాడుతూ.. పార్ట్‌టైం పేరుతో ప్రభుత్వం వెట్టిచాకరీ చేయించుకుంటోందన్నారు. తెలంగాణాలో వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేస్తున్నారన్నారు. ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు అల్లు సత్యనారాయణ, సంఘం రాష్ట్ర కోశాధికారి కె.రవికుమార్, సహాయ కార్యదర్శి షేక్ రెహమాన్, విజయనగరం వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడుగా టి.త్రినాథరావు, ఉపాధ్యక్షుడిగా బి.లక్ష్మీనారాయణ, రాములమ్మ, అప్పలస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.రమణమూర్తి, సహాయ కార్యదర్శులుగా ఈశ్వరరావు, అప్పారావు, రామారావు, కోశాధికారిగా డి. అప్పారావులను ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

అరసవల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): అంగన్ వాడీల వేతనాలు పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షు రాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించా లని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. గతే డాది చేపట్టిన 42 రోజుల సమ్మె సందర్భంగా వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ, నాయకులు పి.లతాదేవి, కె.సుజాత, జె.కామేశ్వరి, కె.లక్ష్మి, ఎస్.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరు దాటితే చీకటే!

(ఐదో పేజీ తరువాయి)

ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారు విద్యుత్ శాఖ సిబ్బంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,500 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. దాదాపు 300 మంది మాత్రమే విద్యుత్‌శాఖ సిబ్బంది ఉన్నారు. అరకొరగా సిబ్బంది ఉండడంతో సక్రమంగా సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో జిల్లాలోని 110 సబ్‌స్టేషన్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్, విద్యుత్ స్తంభాలు, వైర్లు మార్పులు చేశారు. కానీ ఇప్పుడు అవే సమస్యలుగా చూపుతూ విద్యుత్ సరఫరాలో కోత విధిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పరిష్కరిస్తున్నాం..

జిల్లాలో అధికారిక విద్యుత్ కోతలు లేవు. స్థానికంగా నెలకొన్న సమస్యలతోనే సరఫరా నిలిపివేస్తుంటాం. సిబ్బంది కొరత మాట వాస్తవమే. అయినా ఉన్న సిబ్బందితో పనిచేయిస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరిస్తున్నాం.

-ఎన్.కృష్ణమూర్తి, ఎస్ఈ, విద్యుత్ శాఖ, శ్రీకాకుళం

ప్రత్యేక దృష్టి..

ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో విద్యుత్ లైట్ల నిర్వహణపై దృష్టిపెట్టాం. నలుగురు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ విషయంలో కొన్ని ప్రతిపాదనలు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లో సైతం ఎప్పటికప్పుడు విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేస్తున్నాం. సుడా అధికారులు టెండర్లకు పిలిచారు. టెండర్లు ప్రక్రియ పూర్తయిన వెంటనే కొత్త లైటింగ్ పనులు జరుగుతాయి.

-ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం మునిసిపాలిటీ

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రణస్థలం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం వద్ద జాతీయ రహదారి వంతెనపై ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొల్లపేట గ్రామానికి చెందిన లొడగల తవుడు (70) కొద్దిరోజులుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శని వారం రాత్రి పోలీసు బీట్‌లో తవుడు కనిపంచాడు. రోడ్డుకు దూరంగా సిబ్బంది పంపిచారు. తెల్లవారి జామున గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతదేహం నుజ్జునుజ్జయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల పట్టివేత

ఎచ్చెర్ల, జూలై 6(ఆంధ్రజ్యోతి): వంజంగి నుంచి విజయనగరం జిల్లా అలమండకు ఆదివారం అక్రమంగా తరలిస్తున్న ఐదు పశువులను నవభారత్ జంక్షన్ జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. ఈ పశువులను విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజ్జంగి గోశాలకు తర లించారు. పశువులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మిడ్డేమీల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అరసవల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర డిమాండ్ చేశారు. ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల, స్కూల్ స్వీపర్స్ యూనియన్ సమావేశం ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మెనూ చార్జీలు ఒక్కొక్క విద్యార్థికి రూ.20 ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వి.లక్ష్మి, కె.కౌసల్య, పి.జమ్మల, టి.సీతమ్మ, ఏ.రాధ, పి.లక్ష్మి, టి.ప్రవీణ, ఎ.భూదేవి, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఆమదాలవలస/ ఇచ్ఛాపురం/ నరసన్నపేట/జలుమూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముస్లింలు ఆదివారం మొహర్రం పర్వదినాన్ని భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. ఆమదావలసలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ప్రత్యేకంగా తయారు చేసిన షరబత్‌ను పంపిణీ చేశారు. మసీదు గురువు ఆలీ అహ్మద్, ముస్లింలు జిలానీ, బొకారి, అబ్బు, మక్బూల్, యసిన్, మదీనా పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురంలోని కస్పా మసీదుకు సమీపంలో ఉన్న మౌలాలీ పంజా వద్ద ఆదివారం ముస్లింలు మొహర్రం పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మతపెద్ద జోహర్‌ఖాన్, హెచ్ఎం అబ్దుల్లా, అమీర్ ఆలీ, మున్నా, బషీర్, జుల్లు ఆలీ బీక్రీ, యూసఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

● జలుమూరు మండలం కూర్మనాథపురంలో ఆదివారం పీర్ల గుడిలో బిందెలతో దీపాలను పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అరటి గెలలు కట్టారు. పీర్ల గుడి ముందు భాగంలో ఉన్న దర్గా వద్ద అటుకుల, పంచదార ప్రసాదం పెట్టి సాంబ్రాణితో ధూపం వేసి హిందువులు మొక్కు లు చెల్లించుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో పీర్లను పట్టుకొని హిందువులు గుండంతొక్కారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుంచి పీర్లకు మొక్కులు చెల్లించేందుకు జలుమూరు, నరసన్నపేట మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా గ్రామోత్సవం

జలుమూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి గ్రామోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపు చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా స్వామిని మహిళలు దర్శించుకుని హారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

డాక్ సేవక్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

అరసవల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, శ్రీకాకుళం డివిజన్ ద్వైవార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న తపాలా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అలాగే జూలై 9న జరిగే అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా బి.అప్పారావు, కార్యదర్శిగా ఎన్.నందికేశ్వరరావు, కోశాధికారిగా రామకోటేశ్వరరావు, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు, రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.జమాల్ బాషా, వై.స్పర్జన్‌రాజు, వై.మర్రెడ్డి హాజరయ్యారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తరోడ్డు సమీపంలో జిల్లాస్థాయి అండర్-15 చదరంగం పోటీలు ఆదివారం నిర్వహించారు. విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, కార్యదర్శి జె.రమేష్ పతకాలు అందజేశారు. విజేతలు ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వైఎస్‌వీ కుమార్, శిక్షకులు అభినవ్, వసంతరావు, సనపల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

గుజరాతీపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాల యంలో ఆదివారం జరిగిన జిల్లా కార్య వర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు టి.చలపతిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, సంఘ ప్రతినిధులు పి.బాలాజీరావు, ఆర్‌వీ అనంతాచార్యులు, బి.నవీన్, బి.కృష్ణారావు, జితేంద్ర పాల్గొన్నారు.

'ఎన్‌పీటెల్'లో 200 ర్యాంకు

టెక్కలి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మేలో ఐఐటీ, చెన్నై నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఎన్‌పీటెల్ పరీక్షలో దేశవ్యాప్తంగా ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల 200వ ర్యాంక్ సాధించిందని డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం చెన్నై ఐఐటీ మెయిన్ కో-ఆర్డినేటర్ ఆంధ్రూ తంగరాజ్ ర్యాంకింగ్ ధ్రువపత్రాన్ని లెక్చరర్ డా.యుగంధర్‌కు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా యుగంధర్‌ను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అభినందించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పలాస, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఈమేరకు ఆదివారం మొగిలిపాడు పట్టణ ఆరోగ్యకేంద్రం ఆవరణలో పుష్ కార్ట్స్ తయారీని పరిశీలించారు. వీటిని అన్ని వార్డుల్లో అవసరం మేరకు వినియోగిస్తామన్నారు. ఇంటింట చెత్త సేకరణకు వినియోగించనున్నామని, త్వరలో సిబ్బం ది నియామకానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నందిగాం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాంపురం పంచాయతీ జయపురం గ్రామానికి చెందిన రాంపురం రత్నాలమ్మ (54) టెక్కలి జిల్లా కేంద్ర ఆసు పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రత్నాలమ్మ కొద్ది రోజులుగా క ళ్లు కనిపించ కపోవడంతో వైద్యం పొందుతోంది. అయితే ఉపశమనం లేకపోవడంతో మానసికంగా కృంగిపోయి శనివారం రాత్రి గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు గమనించి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందింది. భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కె.జిన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవోగా శాంతయ్య

మందస, జూలై 6(ఆంధ్రజ్యోతి): బాలిగాం పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవోగా డి.శాంతయ్యను నియ మిస్తూ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి కె.మురళీకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మందస పీఏసీఎస్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు సీఈవో పార్వతీశం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో శాంతయ్యను నియమించారు.

జంతువులను ప్రేమిద్దాం

టెక్కలి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులను ప్రేమిద్దామ ని, అలాగే జాగ్రత్తలు పాటిద్దామని పశుసంవర్థక శాఖ డీడీ డాక్టర్ నర్శింహులు అన్నారు. ఆదివారం జూనోసిస్ దినోత్స వం సందర్భంగా జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు, నివారణ చర్యలపై అవ గాహన కలిగించారు. సీజన్‌లో వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండా లన్నారు. కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏడీ బీవీ రమణ, డాక్టర్ లక్ష్మణరావు, టీడీపీ నేతలు బగాది శేషగిరిరావు, కోళ్ల లవ కుమార్, దల్లి ప్రసాద్‌రెడ్డి, ప్రపుల్లా తదితరులు పాల్గొన్నారు.

● కవిటి, జూలై 6(ఆంధ్రజ్యోతి): కవిటి పశు చికిత్సాలయం వద్ద జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. ఇళ్లలో పెంపుడు కుక్కలకు టీకాలు వేసి జాగ్రత్తలు తెలియజే యాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పురుషోత్తం, రవి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ యాసిన్

హిరమండలం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్క రూ దూరంగా ఉండాలని ఎస్ఐ ఎండీ యాసిన్ అన్నారు. ఆదివారం సుభలయ గ్రామంలో 'సంకల్పం'లో భాగంగా మాదక ద్రవ్యాల నివారణ, మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఎక్కువగా వ్యసనాలకు లోనవుతున్నారని, దీనివల్ల భవిష్యత్ అంధకా రంగా తయారవుతుందన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పిల్లల నడవడికలను పరిశీలిస్తుండాలన్నారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి ఉపాధ్యాయుడు శాసనపురి కామేశ్వరరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పాతపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో 1971-72 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్ర మం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. నాటి ఉపాధ్యా యుడు శాసనపురి కామేశ్వరరావును సత్కరించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

తెరవే ఆధ్వర్యంలో 'తెప్పల'కు సత్కారం



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న వేదిక ప్రతినిధులు

పలాసరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఆదివారం జరిగి న తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మంలో పలాస జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తిని సత్కరించారు. ఆయన కవితా మాలికను వినిపించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తికి దుశ్శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరాపల్లి నాగేశ్వరరావు, ఆర్వీ రమణ, కళాకారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



నినాదాలు చేస్తున్న ప్రగతిశీల సమాఖ్య ప్రతినిధులు

పలాసరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మిక చట్టాలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తుండడంతో దీనికి వ్యతిరేకంగా ఈ నెల 9న నిర్వహిస్తున్న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రతినిధులు కోరారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఆది వారం సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లా డుతూ.. సమాన పనికి సమాన వేతనం, పారిశ్రామిక ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చట్టం, ఈఎస్ఐ పెన్షన్, అసంఘటిత రంగ కార్మికు లకు పెన్షన్ వంటివి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో సమాఖ్య ప్రతినిధులు పుచ్చ దుర్యోధన, బి.కొండా రెడ్డి, ఎం.ధర్మా రావు, నారాయణ మూర్తి, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి సంబరం

నందిగాం, జూలై 6(ఆంధ్రజ్యోతి): దేవళభద్ర పంచాయతీ జల్లపల్లి గ్రామంలోని కొత్తమ్మతల్లి అమ్మవారి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పతి ఏటా ఆషాడ శుద్ధ పౌర్ణమి ముందు వచ్చే ఆదివారం సంబరం చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు కలశాలతో మేళ తాళాలు, ఆటపాటల మధ్య ఊరేగింపుగా ఆలయా నికి వెళ్లి అమ్మవారిని ముర్రాటలు సమర్పించి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బంధువుల రాకతో గ్రామంలో సంబరాలు మిన్నంటాయి.

ఆలయానికి కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, గ్రామస్థులు



ఘనంగా తొలి ఏకాదశి పూజలు



టెక్కలి: ప్రత్యేక అలంకరణలో శ్యామసుందరస్వామి..

తొలి ఏకాదశి పూజలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. వేకువ జామునుంచే సత్యనారా యణ, జగన్నాథస్వామి, వేంకటేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు జరిపారు.

- ఆంధ్రజ్యోతి బృందం



నందిగాం: పెంటూరు వేంకటేశ్వర ఆలయంలో చిన్నారుల నృత్యాభినయం



ఇచ్ఛాపురం: సత్యనారాయణస్వామి ఆలయంలో..



కాశీబుగ్గ: పూజారివీధి రాధాకాంత ఆలయంలో..



ఎల్ఎన్‌పేట: పుష్పాలంకరణలో జగన్నాథుడు

సమన్వయంతో పార్టీని నడిపించండి

ఆమదాలవలస, జూలై 6(ఆంధ్రజ్యోతి): సమన్వయం తో పనిచేసి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే, పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు వజ్జ బాబూరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో పట్టణ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా సంపతిరావు మురళీధరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలుగు మహిళా అధ్యక్షురాలిగా బోయిన సునీత, తెలుగు యువత అధ్యక్షుడిగా తంగి శంకరరావు తో పలు విభాగాలకు ప్రతినిధులను నియమించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, నాయకులు మొదలవలస రమేష్, బోర గోవిందరావు, బీవీ రమణమూర్తి, తంగి గురయ్య, నాగల మురళీధర్ యాదవ్, కణితి విజయలక్ష్మీబాయి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

వాంబే కాలనీలో కార్డెన్ సెర్చ్

శ్రీకాకుళం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఒకటో పోలీస్ స్టేషన్ పరిధి వాంబే కాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అందులో ఉంటున్న వ్యక్తులను వారి ఆధార్ కార్డులతో సరిచూ శారు. సరైన పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న సంఘ ప్రధాన కార్యదర్శి వామనమూర్తి

ఇచ్ఛాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు అండగా ఉండి వారి సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వామనమూర్తి అన్నారు. ఆదివారం పట్టణ పరిధి ఆటో యూనియన్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఆటోల ఫిట్‌నెస్ కోసం ఎచ్చెర్ల వెళ్లాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ఎప్పటిలాగే ఇచ్ఛాపు రంలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం సరైంది కాదన్నారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి ఆటోయూనియన్ సభ్యులంతా భారీ ర్యాలీ నిర్వహించి మీ సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆటోయూని యన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మోహన్‌రెడ్డి, హరి, సభ్యులు ఉలాసి ఎర్రయ్యరెడ్డి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ రవికృష్ణ

పలాస, జూలై 6(ఆంధ్రజ్యోతి): జంతువులపై ప్రేమ చూపిస్తూ వాటి నుంచి వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఉల్లాసపేట ప్రభుత్వ వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రారంభించారు. పశువైద్యులు 47కుక్కలకు రేబిస్ టీకాలను వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మట్ట రవికృష్ణ, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వర రావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, డాక్టర్ పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరైన సమయంలో టీకాలు వేయించాలి

కోటబొమ్మాళి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కలకు సరైన సమ యంలో టీకాలు వేయించాలని పశు సంవర్థక శాఖ ఏడీ మంద లోకనాథం అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశు వైద్య కేంద్రంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పశువైద్యాధికారి ఎల్.కిరణ్ కుమార్ 76 పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, వెలమల కామేశ్వ రరావు, విజయలక్ష్మి, లాడి శ్రీను, కర్రి అప్పారావు, సింహాద్రమ్మ, చింతాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● పాతపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల పెంపకం లో అప్రమత్తంగా లేకుంటే ప్రాణాంతక వ్యాధులబారిన పడతారని పశుసంవర్ధకశాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక ప్రాంతీ య పశువైద్యశాలలో పశు వైద్యాధికారి .బి.శ్రీవాణి ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్కలకు ఏంటీ రాబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు పిఅనిల్, కె.మౌనిక, బి.శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



లూయీ పాశ్చర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏడీ మంచు కరుణాకర్

పాడిరైతులకు సహకారం



పశుదాణా పంపిణీ చేస్తున్న విప్ బెందాళం అశోక్

కవిటి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు మేలు చేసేలా రాష్ట్ర ప్రభు త్వం చర్యలు తీసుకుంటుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో పాడిరైతులకు పశుసంవర్థక శాఖ ద్వారా అందించే సబ్సిడీ పశుదాణాను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాడిరైతులకు సహకారం అందించే దిశగా ప్ర భుత్వం నిధులు వెచ్చించి వారి అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. పాడి రైతులకు సగం ధరకే దాణాను అందిస్తున్నామన్నారు. రైతులు పశుసంవర్థక శాఖ ద్వారా లబ్ధిపొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ సిబ్బంది, ఏఎంసీ ఛైర్మన్ మణిచంద్రప్రకాష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వాసుదేవ్ ప్రదాన్, నేతలు బి.రమేష్, పి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి



ఎస్ఐకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో గల ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని ఎలియన్స్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ముకుంద రావుకు వినతి పత్రాన్ని అందజేసి సమస్యలను వివరించారు. మైనర్ డ్రైవింగ్, ఒకే బైక్‌పై ముగ్గురు చొప్పున ప్రయాణించడం, స్పీడ్‌గా వాహనా లను నడపడం, వాహనాల ధ్వని, కాలుష్యం, ఈవ్‌టీజింగ్ వంటి సమస్య లన్నీ పరిష్కరించాలని కోరారు. వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇప్పటికే సదస్సులు నిర్వహించామని, ఇంకా పూర్తిస్థాయిలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లోపింటి నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు ఉమాశంకర్, సభ్యులు బుజ్జి, యోగి, కె.నరసింహమూర్తి, రఘు, బాల, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం

అరసవల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రోటరీ సేవలు ప్రశంసనీయమని శ్రీకా కుళం డీఎస్పీ వివేకానంద అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడారు.

అగ్రహారం భూములపై హక్కులు కల్పించాలి



నిరసన తెలుపుతున్న కొర్లాం రైతులు

సోంపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): అగ్రహారం భూములపై తమకు పూర్తిస్థాయి హక్కు కల్పించాలని కొర్లాం గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం సచివాలయం వద్ద ఆ గ్రామ రైతులంతా నిరస కార్యక్రమం చేపట్టారు. 2023లో చేపట్టిన సర్వే అలుసుగా తీసుకొని గత ప్రభుత్వ హ యాంలో రాష్ట్రస్థాయి అధికారులు డబ్బులకు ఆశపడి వేరే వ్యక్తికి అమ్మ బోయారని తెలిపారు. ఇప్పటికీ స్థానిక రైతులకు అడంగళ్లు రావడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అగ్రహా రం భూములు నిజమైన కొర్లాం రైతులకు అందేలా చూడాలని కోరారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం

అరసవల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని విశాఖపట్నం గాజువాకకు చెందిన నారాయణశెట్టి మురళీకృష్ణ, వసంతకుమారి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.లక్ష విరాళంగా అందజేశారు.

అవలింగిలో మారు రథయాత్ర



అవలింగిలో మారు రథయాత్రలో పాల్గొన్న భక్తులు

జలుమూరు (సారవకోట), జూలై 6(ఆంధ్రజ్యోతి): అవలింగి గుండిచా మందిరంలో కొలువు తీరిన జగన్నాథ స్వామి మారు రథయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. పదిరోజులపాటు వివిధ అవతారాల్లో దర్శనమి చ్చిన స్వామి మారు రథయాత్రతో నిజస్థానానికి చేరుకున్నారు. భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులు అందించి తరించారు.

● పోలాకి, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు పంచాయతీ ముప్పిడిలో ఆదివారం మారురథయాత్ర నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గ్రామం లో ఊరేగించారు.

ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి

టెక్కలి, జూలై 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం టెక్కలి లో నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్రచక్రవర్తి పూలమాల వేసి నివాళులర్పిం చారు. అనంతరం ప్రధాని మోదీ సుపరిపాలన, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా 11 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పనుల కరపత్రాలు ఇంటింటికి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జన్ని పరమేష్, పార్టీ మండల అధ్యక్షుడు జర్జాన రామ్‌జీ, నడుపూరు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● కాశీబుగ్గ, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పదోవార్డు శివాలయం వీధిలో ఆదివారం భారతీయ జన సంఘ్ వ్యవస్థాప కుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయం తిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకుడు పి.వైకుంఠరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.



టెక్కలి: ముఖర్జీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కాశీబుగ్గ: ముఖర్జీ చిత్రపటం వద్ద..